సాక్షి
రంగారెడ్డి

మంగళవారం • 9 • ఏప్రిల్ • 2024




నామినేషన్లకు సన్నద్ధం

లోక్‌సభ అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 25 వరకు తమ నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ శశాంక తెలిపారు. 8లో▸



కాంగ్రెస్‌ను నమ్మి..

కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు మోసపోయారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కేశంపేట: దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్తకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీకే అరుణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు అంటూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. వారి మోసపూరిత హామీలను ప్రజలు గుర్తించారని, రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సింహ యాదవ్, మోటే శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశ భద్రత బీజేపీతోనే సాధ్యం

కొత్తూరు: బీజేపీతోనే దేశభద్రత సాధ్యమని డీకే అరుణ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశ ఖ్యాతి, కీర్తిని ప్రపంచ దేశాలకు విస్తరించిన ఘనత బీజేపీదే అన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒకే సంతతి పార్టీలని ఎద్దేవా చేశారు. పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబాయ్య, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగురావునామాజీ, నర్సింహగౌడ్, మోహన్‌నాయక్, నాగరాజుచారి, మహేందర్‌రెడ్డి, పాపయ్యగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రోధినామకు స్వాగతం

ఉగాది పర్వదినాన్ని (క్రోధినామ సంవత్సరం) మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు.ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ పఠనాల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగకు కావాల్సిన కుండలు, మామిడి ఆకులు, మామిడికాయలు,వేపపూత, చింతపండు, పూలు తదితర సామగ్రి కొనుగోళ్లతో సోమవారం మార్కెట్లలో సందడి నెలకొంది.

– ఆమనగల్లు

ఆనందమయం కావాలి

జిల్లా ప్రజలకు శ్రీక్రోధినామ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసాదించాలి. ప్రతి ఒక్కరి జీవితం కొత్త ఆశలు, ఆశయాలు, ఆలోచనలతో ఆనంద మయం కావాలి.

– సబితా రెడ్డి, మాజీమంత్రి, ఎమ్మెల్యే, మహేశ్వరం

శుభాలు చేకూరాలి

శ్రీక్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు చేకూరాలి. జిల్లా మరింత ప్రగతి సాధించాలి. తెలుగు నామాది నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని మనసారా కోరుకుంటున్నా. ఉగాది పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి.

– శశాంక, జిల్లా కలెక్టర్





ఆమనగల్లులో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న స్థానికులు

సర్వేకు ససేమిరా

- అధికారులను అడ్డుకున్న మొండిగౌరెల్లి రైతులు

యాచారం: సర్వే కాదు.. ముందు అసైన్డ్ పట్టాలు పొందిన రైతుల పేర్లు ధరణి పోర్టల్‌లో నమోదు చేసి పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలని మొండిగౌరెల్లి రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 19,68,127లో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా అసైన్డ్, ప్రభుత్వ భూమిని వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు సేకరించాలని సర్కార్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం నుంచి డీఐఓఎస్ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే) ఆధ్వర్యంలో ఇద్దరు ఆర్ఐలు, మరో ఇద్దరు రెవెన్యూ బృందం సర్వే నంబర్ 19లోని అసైన్డ్, ప్రభుత్వ భూమిని సర్వే చేయడానికి వెళ్లింది. సమాచారం అందుకున్న రైతులు అధికారుల బృందాన్ని కలిసి సర్వే వద్దు.. ముందు ఏళ్ల క్రితం అసైన్డ్ పట్టాలు పొందిన రైతుల పేర్లు నేటికీ ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు కాక పట్టాదారు, పాసుపుస్తకాలు రాలేదు, బ్యాంకు రుణాలు రావడం లేదు, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందు అసైన్డ్ పట్టాలున్న రైతుల పేర్లు ఆన్‌లైన్ ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా అసైన్డ్ భూములను నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాం, ఆ భూములను సాగుకు యోగ్యంగా మార్చుకోవడం కోసం రూ.లక్షల్లో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం.. ఇప్పుడే అప్పులు తీరే పరిస్థితులు ఉంటున్నాయి, ఈ సమయంలో అసైన్డ్ భూములు తీసుకుంటామంటే ఊరుకునేది లేదని వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు.



రైతులు సర్వేను అడ్డుకోవడంతో వెనుదిరిగిన సర్వే, రెవెన్యూ అధికారుల బృందం

35 హత్య కేసులు..

కొడుకు చేతిలో హతం

- మృతుడు బాలన్న గ్యాంగ్ స్టర్ నయీం అనుచరుడిగా గుర్తింపు
- గంజాయి మత్తులో అంతమొందించిన కుమారుడు
- ఆస్తి కోసమా.. కుటుంబ తగాదాలా..?
- కొనసాగుతున్న పోలీసుల విచారణ

ఇబ్రహీంపట్నం రూరల్: 35 హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి చివరికి కొడుకు చేతిలో హతమయ్యాడు. ఈ నెల 4న జరిగిన ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. తనయుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన రవీందర్‌ను మాజీ నక్సలైట్ తిరుపాటి బాలన్నగా పోలీసులు గుర్తించారు. నయీం అనుచరుడైన అతను కుమారుడు అనురాగ్ చేతిలో ప్రాణాలు విడిచినట్లు పోలీసులు వెల్లడించారు. హత్యకు ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా.. అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.



రవీందర్ అలియాస్ బాలన్న

దాడి జరిగింది ఇలా..

తండ్రిని అంతమొందించేందుకు పథకం ప్రకారం అనురాగ్ పెట్రోల్ తీసుకు వచ్చాడు. గత గురువారం మధ్యాహ్నం తల్లి నిద్రలో ఉండగా బయట నుంచి తాళం పెట్టి తండ్రితో గొడవకు దిగాడు. ముందుగానే తెచ్చి పెట్టుకున్న పెట్రోల్‌ను తండ్రిపై పోసి నిప్పంటించాడు. కాలుతున్న గాయాలతో పరుగెత్తిన బాధితుడు కిందపడిపోవడంతో పక్కనే ఉన్న బండరాయితో తలపై మోది హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. మృతుడి భార్య సుధ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తి వ్యవహారాల్లో హత్య జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. నెలరోజుల క్రితమే బాలన్న కోటి రూపాయల విలువైన ఇంటిని కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.

ఇదీ బాలన్న చరిత్ర

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన తిరుపాటి రవీందర్ అలియాస్ బాలన్న నగరంలోని గచ్చిబౌలి ప్రాంతంలో చాలా కాలం క్రితం స్థిరపడ్డాడు. నగరంలో స్థిరాస్తి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మొదటి భార్య చనిపోవడంతో సుధ అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. మావోయిస్టు పార్టీలో పనిచేసి తర్వాత నయీం అనుచరుడిగా కొనసాగినట్టు దర్యాప్తులో వెల్లడైంది. బాలన్న మొదటి భార్యకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారిలో పెద్దకొడుకు చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. చిన్నకొడుకు విదేశాల్లో స్థిరపడ్డాడు. ప్రస్తుతం రెండో భార్య సుధతో కలిసి ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికంగా రవీందర్‌గా చలామణి అవుతున్న బాలన్నపై 35కు పైగా హత్యకేసులు నమోదయ్యాయి. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత అజ్ఞాతంలో ఉన్నాడు. రెండు నెలల క్రితం తుర్కయంజాల్‌లోని ఆరెంజ్ అవెన్యూ కాలనీలో కొత్తగా కొనుగోలు చేసిన ఇంట్లోకి బాలన్న కుటుంబం షిఫ్ట్ అయ్యింది. రవీందర్, సుధ దంపతులకు అనురాగ్, అభిషేక్ సంతానం ఉన్నారు. పెద్దకొడుకు అనురాగ్ ఖాళీగా ఉంటున్నందుకు మందలించడంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. డ్రగ్ ఎడిక్షన్ మాన్పించడానికి రిహాబిలిటేషన్ కేంద్రంలో చేర్పించి చికిత్స చేయించినా మార్పు రాలేదు. ఇప్పటికే అతనిపై రెండు పోలీసు కేసులు కూడా ఉన్నాయి.

పెళ్లి చేసుకోమంటే.. గొంతు కోసుకున్నాడు

ప్రియురాలి ఒత్తిడితో.. మీర్‌పేట పీఎస్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఆకాశ్

మీర్‌పేట: ఇన్‌స్టాగామ్ పరిచయం కాస్త ప్రేమగా మారింది.. పెళ్లి పేరెత్తగానే సదరు యువకుడు ఠాణాలోనే బ్లేడుతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్రాంరెడ్డి తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం వెల్లిగుట్ట తండాకు చెందిన ఇస్లావత్ ఆకాశ్ (21) నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అచ్చంపేటకు చెందిన యువతి (19) నందనవనంలో ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరికి 2022లో ఇన్‌స్టా ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమ పేరుతో యువతికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇటీవల యువతి వివాహం చేసుకోవాలని కోరడంతో ఆకాశ్ నిరాకరించాడు. యువతి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. రెండు రోజుల క్రితం పెద్ద మనుషుల పంచాయితీ పెట్టడంతో యువకుడు పెళ్లికి ఒప్పుకొని తర్వాత మాట మార్చాడు. విసిగిన యువతి మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం సాయంత్రం ఇరువురి బంధువులు పోలీస్‌స్టేషన్‌కు రాగా యువతి బంధువులు ఆకాశ్‌ను పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పెళ్లి ఇష్టం లేదని స్టేషన్‌లోనే బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు వెంటనే యువకుడిని చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతనికి ఎటువంటి ప్రాణాపాయం లేదని.. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే ముస్లింలను గౌరవం

భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ముస్లింలకు రంజాన్ అత్యంత పవిత్రమైన పండగ అని బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణ కేంద్రంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పండ్లు ఇచ్చి ఉపవాసం విడిపించారు. ఈ సందర్భంగా క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. ముస్లింలను గౌరవించిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. ప్రతీ రంజాన్‌కు రంజాన్ తోఫా, విందులు ఏర్పాటు చేసి ఒక్క చోటుకు చేర్చామని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాలకు, అన్ని మతాలకు న్యాయం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల యాదగిరి, జగన్, సుజాత రవీందర్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ అంజిరెడ్డి, కర్నె అరవింద్, ముజాకీర్, రమేశ్, జహంగీర్‌లతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

కేశంపేట: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కారించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి సోమవారం ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సిబ్బందికి ఆరునెలల నుంచి జీతాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీ సిబ్బంది డిమాండ్లను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు రాంచందర్, జంగయ్య, అంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.

ఉగాదికి ఆలయాల ముస్తాబు

రాజేంద్రనగర్: ఉగాది పండుగకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పంచాగ పఠనం కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే టెంపుల్స్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో పాటు పూలతో అందంగా అలంకరించారు. ఉదయం పూజల అనంతరం పంచాగ పఠనాన్ని చేపట్టనున్నారు. ప్రధానంగా రాజేంద్రనగర్, బుద్వేల్, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రాంతాల్లోని ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

ఇంజనీర్ల బస్తీబాట



పబ్లిక్ డీటీఆర్ వద్ద టంగ్ టెస్టర్‌తో లోడ్ చెక్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజనీర్లు బస్తీబాట పట్టారు. ఇప్పటికే సబ్‌స్టేషన్లు, లైన్ల వెంట తిరిగి సరఫరా తీరును పరిశీలించిన అధికారులు తాజాగా..బస్తీ/కాలనీల్లో పర్యటిస్తున్నారు. సరఫరా వ్యవస్థలోని సాంకేతిక సమస్యలను గుర్తించి, కోతలు, హెచ్చుతగ్గులు వంటి సమస్యలను పూర్తిగా నివారించాలని నిర్ణయించారు. ఇందు కోసం ఇప్పటికే ఓవర్‌లోడు కారణంగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను (పీటీఆర్)గుర్తించారు. అవసరమైన చోట కొత్తగా అదనపు పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. తాజాగా వీధి చివర్లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఒత్తిడిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల సమయం (పీక్ అవర్)లో ఆయా సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ల పరిధిలోని ఇంజనీర్లు, జూనియర్ లైన్‌మెన్లు ఫీడర్ల పరిధిలోని కాలనీలు/బస్తీల్లో పర్యటించి, టంగ్ టెస్టింగ్ ద్వారా లోడును రికార్డు చేయనున్నారు. అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, కోతలకు ఆస్కారం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా సర్కిళ్ల ఇంజనీర్లను సమన్వయం చేస్తున్నారు. సరఫరాలో అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు.

పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు

సాధారణ రోజుల్లో రోజు సగటు విద్యుత్ డిమాండ్ 55 ఎంయూలు నమోదవుతుండగా, ప్రస్తుతం 80 ఎంయూలు దాటింది. సామర్థ్యానికి మించి రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు(పీటీఆర్), ఫీడర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి.

విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో..

- పీక్ అవర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- డీటీఆర్‌లకు టంగ్ టెస్టింగ్ పరీక్షలు
- ఒత్తిడికి లోనవుతున్న పీటీఆర్, డీటీఆర్‌ల గుర్తింపు
- లోడ్ బ్యాలెన్స్‌కు సిఫార్సు

దీంతో పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు చర్యలు చేపట్టారు. నారపల్లి సబ్‌స్టేషన్‌లోని 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 ఎంవీఏకు, జల్‌పల్లి సబ్‌స్టేషన్‌లోని 8 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 12.5 ఎంవీఏకు, ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్‌లోని 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని నుంచి 8 ఎంవీఏకు, కోకాపేట్ సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచారు. అదే విధంగా కందికల్‌గేట్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా 8 ఎంవీఏ పీటీఆర్‌ను, సోమశిల సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ పీటీఆర్‌ను ఏర్పాటు చేశారు.

- విద్యుత్ కోతలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో తాజాగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు (పీక్ అవర్) క్షేత్రస్థాయి సిబ్బంది కాలనీలు, బస్తీల్లో పర్యటించారు. వీధి చివర్లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ బ్యాలెన్సింగ్ కోసం టంగ్ టెస్టర్ ద్వారా కచ్చితమైన లోడ్లను రికార్డ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. పీక్ అవర్‌లో అధిక లోడుతో తీవ్ర ఒత్తిడికి గురై, తరచూ ఫ్యూజ్‌లు కొట్టేస్తున్న డీటీఆర్‌లను గుర్తించి, వాటి సామర్థ్యం పెంచేందుకు ఏర్పాటు చేస్తుండటం విశేషం.

రంగారెడ్డి జోన్‌లో విద్యుత్ డిమాండ్

తేదీ	2023 ఏప్రిల్‌లో.. మెగావాట్లు	2023 ఏప్రిల్‌లో.. మిలియన్ యూనిట్లు	2024 ఏప్రిల్‌లో.. మెగావాట్లు	2024 ఏప్రిల్‌లో.. మిలియన్ యూనిట్లు	పెరిగిన వినియోగం
1	1,343	29.55	1,662.00	40.42	26.91 శాతం
2	1,378	31.00	1,681.00	40.68	23.80 శాతం
3	1,441	32.69	1,883.00	47.20	30.75 శాతం
4	1,375	33.13	1,966.00	44.46	25.48 శాతం
5	1,437	33.51	1,984.65	44.71	25.06 శాతం
6	1,391	30.64	1,792.55	43.69	29.87 శాతం
7	1,352	30.18	1,642.25	41.72	27.67 శాతం

గ్రేటర్‌లో డీటీఆర్‌లు

సర్కిల్ పేరు	డీటీఆర్‌లు
హైదరాబాద్ సెంట్రల్	9,200
బంజారాహిల్స్	9,729
సికింద్రాబాద్	7,951
హైదరాబాద్ సౌత్	7,306
రాజేంద్రనగర్	30,799
మేడ్చల్	22,962
సైబర్‌సిటీ	27,173
హబ్సిగూడ	14,449
సరూర్‌నగర్	17,622

నియామకం

కడ్తాల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్ నూతన పదవిని కట్టబెట్టారు. సోమవారం గిరిజన మోర్చా రాష్ట్ర శాఖ నుంచి వెలువడిన ఉత్తర్వుల్లో ఆయన బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కోఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాయిలాల్ నాయక్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని.. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేసేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

మెడికల్ కాలేజీలో రేపు ఇంటర్వ్యూలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మెడికల్ కాలేజీలో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 10వ తేదీన రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏడు ట్యూటర్, 22 సీనియర్ రెసిడెంట్ల పోస్టులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పోస్టుల్లో చేరేందుకు అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

చికెన్ 65లో పురుగు

శంషాబాద్: పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న కినారా గ్రాండ్ హోటల్‌లో వినియోగదారుడు తీసుకున్న చికెన్ 65 బిర్యానీలో పురుగు రావడంతో మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు అక్కడికి వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించా రు. దీంతో హోటల్ యజమాన్యానికి అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది.

నామినేషన్లకు సన్నద్ధం

- ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరణ ప్రక్రియ
- రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లు
- సభలు, సమావేశాల కోసం 'సువిధ'లో దరఖాస్తు చేసుకోవాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శశాంక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 25 వరకు రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తమ నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ శశాంక తెలిపారు. ఇందు కోసం నామినేషన్ ఫారం -2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందొచ్చని సూచించారు. ఈ మేరకు ఆయా పార్టీల ప్రతినిధులతో సోమవారం రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమావేశమయ్యారు. సెలవు మినహా ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

అభ్యర్థులకు సూచనలు

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదిస్తే సరిపోతుంది. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందినవారైన పక్షంలో తప్పనిసరి వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్‌ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- రిజిస్టర్డ్, గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్-3 లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేస్తూ వివరాలు పొందుపర్చాలి.
- అభ్యర్థులు గరిష్టంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయొచ్చు. సంబంధిత బ్యాంకు అకౌంట్ లావాదేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుంది.
- అభ్యర్థులు ఏవైనా క్రిమినల్ కేసులుంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3 ఏలో వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాల్సి ఉంటుంది.
- గడిచిన పదేళ్లలో ఎవరైనా అభ్యర్థులు ప్రభుత్వ క్వార్టర్లలో ఉన్నట్లయితే, నీటి బిల్లులు, కరెంటు బిల్లులు వంటివి బకాయిలు లేవని నిరంభ్యంతర పత్రం జతపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీల వంటివి ముంద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127 – ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు 48 గంటల ముందు 'సువిధ' పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

శ్రీనివాస్ యాదవ్‌కు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసుయాదవ్

తలకొండపల్లి: ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆధ్వర్యంలో అందించిన ఉగాది పురస్కారాలకు వెల్జాల్‌కు చెందిన మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని హ్యాపీ రిసార్ట్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు, నిర్మాత, ఎంఏ రత్నం చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సదర్భంగా ఎంఏ రత్నం మాట్లాడుతూ.. శ్రీనివాస్ యాదవ్ చేపట్టిన సేవకార్యక్రమాలను గుర్తించి సామాజిక సేవా విభాగంలో సంఘ సంస్కర్తగా ఎంపిక చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అంతర్జాతీయ స్థాయిలోనూ అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ను శాలువా, మెమొంటో, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసుయాదవ్ మాట్లాడుతూ.. ఉగాది పురస్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి మోహన్‌గౌడ్, ఇంజమూరి మధు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి జనం మోసపోయారు

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోయారని, తొందరగా వాస్తవాలు అర్థమయ్యాయని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ సారథ్యంలో పల్లెలు, పట్నాలు శరవేగంగా అభివృద్ధి చెందాయని, ప్రజలు సుభిక్షంగా జీవించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే కరువు వచ్చిందన్నారు. ప్రజలకు తిరిగి అవస్థలు మొదలయ్యాయని తెలిపారు. ఆరు గ్యారంటీల పేరిట ఇచ్చిన 13 హామిలతో పాటు కాంగ్రెస్ మానిఫెస్టో లో పొందుపర్చిన 420 హామీలను కాంగ్రెస్‌పార్టీ అటకెక్కించిందన్నారు. కరెంట్ కోతలు, తాగునీటి ఇబ్బందులు, అభివృద్ధి పనులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మూకుమ్మడిగా మద్దతు తెలిపేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టనున్నారని పేర్కొన్నా. భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్ విజయం కోసం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, ఎంపీపీ కృపేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందడుగు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, రాజు, రజని తదితరులు

షాబాద్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రతీ ఒక్కరికి గౌరవం దక్కుతోందని.. ఆయన స్ఫూర్తితోనే ముందడుగు వేద్దామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జాతీయ దళిత సేన అధ్యక్షులు జేబీ రాజు అన్నారు. సోమవారం వారు మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడలో గ్రామస్తులు ఏర్పా టు చేసుకున్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగంతోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లు సైతం ఆయన చలువే అన్నారు. చట్టసభల్లోనూ మహిళలకు 50శాతం రిజర్వేషన్లు దక్కేందుకు పురుషులు సహకరించాలని కోరారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని సాయిచందర్, విశ్వజన కళామండలి జాతీ య అధ్యక్షుడు మాస్టార్జీ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు విద్య, సామాజిక దురాచారాల నిర్మూలణకు కృషి చేయాలన్నారు. ఆత్మగౌరవం కోసం పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్ హెచ్‌ఏఎల్ నీరటి రాంచంద్రయ్య, బేగరి ఆంజనేయులు, రిటైర్డ్ ఎసీపీ యాదయ్య, తెలుగు పండిత్ ఆశీర్వాదం అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, పీఎస్‌ఎస్ ఉపాధ్యక్షులు మద్దూరు మల్లేశ్, మాజీ సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ సభ్యులు సునీత, పాండు, నాయకులు రామస్వామి, వెంకటయ్య, సత్తయ్య, చెన్నయ్య, మాణెయ్య, మాజీ సర్పంచ్‌లు కృష్ణగౌడ్, పెంటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.